క్లుప్తంగా

ఆంజనేయ స్వామికి పూజలు

ప్రత్తిపాడు రూరల్: ఉత్తరకంచి అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం భారతీయ సనాతన ధర్మరక్షణ మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

వైభవంగా బాబా ఆలయ వార్షికోత్సవాలు

ఏలేశ్వరం: లింగంపర్తి గ్రామంలో షిరిడి సాయి బాబా ఆలయ వార్షికోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తొమ్మిది రోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు. తొలిరోజు అర్చకుడు వంకాయలపాటి సాయి, నూకల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గణపతి పూజ, కాకడ హారతి, అభిషేకాలు, అర్చనలు, సాయి పారాయణం, సంధ్యాహారతి తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి.

ఆర్టీసీ ఉచిత బస్‌పాస్‌ల పంపిణీ



దివ్యాంగులకు పాస్‌లను అందజేస్తున్న నాయకులు

ప్రత్తిపాడు రూరల్: ఒమ్మంగి గ్రామ సచివాలయంలో దివ్యాంగులకు ఆర్టీసీ ఉచిత బస్ పాస్‌లను వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు రామిశెట్టి చినబాబు, రామిశెట్టి బులిరామకృష్ణ చేతుల మీదుగా పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం అండగా నిలుస్తూ ఆయా సచివాలయాల ద్వారా ఉచిత బస్ పాస్‌లను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. నాయకుడు మామిడి నరసింహమూర్తి, ఆర్టీసీ, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

శంఖవరం: వాహనదారులు నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ప్రత్తిపాడు సీఐ కిశోర్‌బాబు హెచ్చరించారు. కత్తిపూడి హైవేలో అడిషనల్ ఎస్సై అజేయ్‌బాబు కలిసి ఆయన వాహనాలను తనిఖీ చేశారు. నిబంధనలు ఉల్లగించిన వారిపై చర్యలు తీసుకున్నారు. ఈ తనిఖీల్లో ఓవర్ స్పీడుగా వాహనాలు నడిపే వారిపై, హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపే వారిపై 20 కేసులు నమోదుచేసినట్టు తెలిపారు.
రౌతులపూడి: నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎస్.స్వామినాయుడు అన్నారు. రోడ్డు భద్రతా కార్యక్రమంలో భాగంగా మల్లంపేట జంక్షన్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. రికార్డులు సక్రమంగా లేని వాహనదారులకు అపరాధ రుసుం విధించారు.

64 మందికి వైద్య పరీక్షలు



వాకర్స్‌కు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తుని: స్థానిక గణపతినగర్‌లో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 64 మందికి పరీక్షలు నిర్వహించామని వాకర్స్ ఎలెక్ట్ గవర్నర్ చదరం శివాజీ మంగళవారం తెలిపారు. వాకర్స్ ఇంటర్నేషనల్ అనుబంధ సంస్థ వాకర్స్ క్లబ్ పర్యవేక్షణలో డయాబిటిక్ కేర్ సెంటర్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురికి బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించారు. క్రమం తప్పకుండా నడకతో పాటు వైద్య పరీక్ష చేయించుకోవాలని వైద్యుడు సూర్యనారాయణ సూచించారు. వాకర్స్ క్లబ్ ప్రతినిధులు కుందెం సత్యనారాయణ, రెడ్డి రత్నం, కె.బీమరాజు, పర్వత బాబూరావు, చోడిశెట్టి బాబూరావు, జూరెడ్డి చిరంజీవి పాల్గొన్నారు.

బాలుడి వైద్యానికి ఆర్థిక సహాయం



బాలుడి కుటుంబ సభ్యులకు సాయం అందిస్తున్న కార్యదర్శి శ్రీనివాసరావు

గోకవరం: అరుదైన వ్యాధితో బాధపడుతున్న బాలుడి వైద్యానికి గోకవరం వలంటీర్లు తమ వంతు ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామానికి చెందిన పాటూర్నరి సతీష్ కుమారుడు రెండున్నరేళ్ల సత్యశ్రీఅక్షయ్‌రామ్ సీజీడీ అనే అరుదైన వ్యాధి బారిన పడ్డాడు. చికిత్సకు సుమారు రూ.30 లక్షల వరకు ఖర్చవుతుందని తన కుమారుడి వైద్యానికి సహకరించాలని బాలుడి తండ్రి సోషల్ మీడియా వేదికగా సహాయం కోరాడు. అది చూసిన గోకవరంలో వలంటీర్లు రూ.5,500 నగదును బాలుడి వైద్య ఖర్చుల కోసం సమకూర్చారు. ఈ మొత్తాన్ని మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావు చేతుల మీదుగా బాలుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

రేపు క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

గోకవరం: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో గురువారం ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు గోకవరం ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డాక్టర్ వనజాకుమారి మంగళవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ శిబిరం జరుగుతుందన్నారు. 30ఏళ్లు దాటిన స్త్రీ, పురుషులు ఈ పరీక్షలు చేయించుకోవాలన్నారు.

సమస్యల పరిష్కారంలో ముందుండాలి

- అధికారులకు మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి ఆదేశం
- ప్రజా సమస్యలపై చర్చించిన కౌన్సిలర్లు
- తుని మున్సిపల్ కౌన్సిల్ సమావేశం





మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి, హాజరైన కౌన్సిలర్లు

తుని: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు చురుకైన పాత్ర పోషించాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. మంగళవారం పురపాలక సంఘం కౌన్సిల్ సాధారణ సమావేశం సీపీ సుధారాణి అధ్యక్షతన జరిగింది. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున అభివృద్ధి పనులకు సంబంధించిన అజెండాను సమావేశంలో ప్రవేశపెట్టలేదని కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు. ప్రజలకు సంబంధించిన పలు అంశాలను జీరో అవర్‌లో చర్చించారు.

సమస్యలపై చర్చ

- పట్టణ పరిధిలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన రోడ్లను టెలిఫోన్ కేబుల్స్, పైపులైన్ల పనులకు తవ్వుతున్నారని, తర్వాత వాటిని పూడ్చకుండా వదిలేస్తున్నారని కౌన్సిలర్ ఆరుగుల రవికుమార్ అన్నారు. సినిమా రోడ్డులో పెద్ద గుంత పడిందని, రాత్రి సమయాల్లో చాలా మంది ప్రమాదాలకు గురువుతున్నారన్నారు. దీంతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ ఈ సమస్య ఉందని పలువురు కౌన్సిలర్లు తెలిపారు. రోడ్డు కటింగ్‌కు చార్జీలు వసూలు చేస్తున్నప్పుడు ఎందుకు పూడ్చడం లేదని సీపీ సుధారాణి అధికారులను ప్రశ్నించారు. దీనిపై ఇంజినీరింగ్ అధికారులు సమాధానమిస్తూ రోడ్డులో గోతులను ఎప్పటికప్పుడు పూడ్చుతున్నామని, కొన్ని చోట్ల ఆలస్యమవుతుందన్నారు.
- ట్రాన్స్‌కో అధికారులు ప్రతి శుక్రవారం చెట్ల కొమ్మల తొలగింపు కోసం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని, ముస్లిం వీధిలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద చెట్టు తొలగించాలని పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని కౌన్సిలర్ ఎస్‌కే క్వాజా తెలిపారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగే చెట్ల కొమ్మలను మాత్రమే తొలగిస్తామని, మిగతా చోట్ల తమకు సంబంధం ఉండదని ట్రాన్స్‌కో అధికారులు చెప్పారు.
- పట్టణంలోని పలు ప్రాంతాల్లో కుళాయి నీరు రంగు మారిందని, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పలువురు కౌన్సిలర్లు అన్నారు. దీనిపై వివరణ ఇవ్వాలని నీటి సరఫరా విభాగాన్ని సీపీ సుధారాణి సూచించారు. తుని మండలం రేఖవానిపాలెం వద్ద తాండవ నదిలో నిర్మించిన పంపుహౌస్ నాలుగేళ్లకు ఒకసారి శుభ్రం చేయాల్సి ఉందని, త్వరలో పనులు చేపడతామని సమాధానం ఇచ్చారు. దీంతో పాటు వేసవిలో నీటి ఎద్దటి లేకుండా చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ కర్రి సత్య జగదీష్ కోరారు. మరమ్మతులకు గురైనా చేతి పంపులను త్వరలో వినియోగంలోకి తీసుకువస్తామని, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు.
- వీధి కుక్కల వలన జరుగుతున్న వరుస సంఘటనలపై సభ్యులు, అధికారులు తీవ్రస్థాయిలో చర్చించారు. కుక్కల నియంత్రణకు ఎటువంటి చర్యలు తీసుకోవాలో ప్రభుత్వ పరంగా ఇచ్చే ఆదేశాల కోసం ఎదురు చుస్తున్నామని శానిటేషన్ విభాగం అధికారులన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సమస్యలపై త్వరలో స్పష్టత వచ్చే అవకాశం ఉందని సీపీ సుధారాణి అన్నారు.
- పట్టణంలో శానిటేషన్ పరిస్థితులు బాగోలేదని కో ఆప్షన్ సభ్యుడు ఏలూరి బాలు అన్నారు. ట్రాక్టర్ల కొరత వల్ల చెత్త సేకరణకు ఇబ్బందిగా ఉందని, త్వరలో పరిస్థితులను చక్కదిద్దుతామన్నారు. పట్టణ పరిధిలో పందుల బెడద తగ్గిందని, వైరస్ కారణంగా 200 వరకు పందులు చనిపోయానని అధికారులు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, కౌన్సిలర్లు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల జీవితం ఆదర్శం



బొద్దవరం హైస్కూలుకు దేశనాయకుల చిత్రపటాలను అందిస్తున్న ఎంపీపీ శ్రీనివాసు తదితరులు

కోటనందూరు: ప్రాణాలర్పించి దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన స్వాతంత్ర్య సమరయోధుల జీవితం నేటి విద్యార్థులకు ఆదర్శమని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. మంగళవారం బొద్దవరం హైస్కూలుకు అదే గ్రామానికి చెందిన రామకృష్ణా సేవా సమితి ఆర్థిక సహాయంతో సమకూర్చిన 35 మంది స్వాతంత్ర సమరయోధుల చిత్రపటాలను బహూకరించారు. అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు ఈ చిత్రపటాలను సరఫరా చేయనున్నట్టు రామకృష్ణ సేవా సమితి ప్రతినిధి యల్లపు దొరబాబు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వేగి లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల యూత్ కన్వీనరు చింతకాయల చినబాబు, సచివాలయ కన్వీనరు దొడ్డి బాబ్జీ పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుంకర శ్రీవల్లి

గోకవరం: గ్రామాల్లో ప్రజలకు అధికారులు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని గోకవరం ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ శ్రీవల్లి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు శాఖల అధికారులు శాఖాపరంగా ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీలు మాట్లాడుతూ సభ్యులు లేవనెత్తిన సమస్యలపై అధికారులు దృష్టి సారించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీడీఓ కేవీఎస్ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

డ్రైన్‌లో పూడికతీత

కోటనందూరు: స్థానిక కో-ఆపరేటివ్ సొసైటీ వెనుక ఉన్న రోడ్డుపై పేరుకుపోయిన చెత్త, ఈ రోడ్డును ఆనుకొని ఉన్న డ్రైన్‌లో పూడికను మంగళవారం తొలగించారు. వ్యవసాయ మకాలకు వెళ్లేందుకు ఈ రోడ్డు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, మురుగు వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆ ప్రాంత మహిళలు సర్పంచ్ గర్సింగు శివలక్ష్మి దృష్టికి తీసుకెళ్లారు. సర్పంచ్ ఆదేశాలతో పంచాయతీ అధికారులు పొక్లెయిన్‌తో ఈ పనులు చేపట్టారు. గర్సింగు దొరబాబు, ఉపసర్పంచ్ దార్ల సూర్యచంద్ర పరిశీలించారు.

వైభవంగా మహాలక్ష్మీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

- అర్చకులచే కలశ స్థాపన
- నేడు మంత్రులచే శ్రీవారి పుష్కరిణి ప్రారంభోత్సవం

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద నిర్మించిన శ్రీవారి పుష్కరిణిలో మహాలక్ష్మీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. మంగళవారం ఉదయం శాస్త్రోక్తంగా అర్చకులు శ్రీవారి పుష్కరిణి మధ్యలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం ఆలయంపై కలశ స్థాపన చేసి, కుంభాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద కలశాల ఊరేగింపు, చతుర్వేదపారాయణం, యాగశాలార్చన, హోమం, యంత్ర ప్రతిష్ఠ, రత్నన్యాసం, పిండికాన్యాసం, నివేదన, కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేశారు. సాయంత్రం యాగశాలారాధన, మూలమంత్ర తదితర సేవలు నిర్వహించారు. లోవ ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న శ్రీవారి పుష్కరిణి



శిఖరంపై కలశ ప్రతిష్ఠ చేస్తున్న అర్చకులు

నేడు మంత్రులచే పుష్కరిణి, విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

పాత సంచువల వర్తక సంఘం, గ్రామస్తుల ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 7.40 గంటలకు శ్రీవారి పుష్కరిణి ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు జరపనున్నట్టు సంఘం అధ్యక్షుడు, దేవస్థానం చైర్మన్ కోలా భీమేశ్వరరావు తెలిపారు. దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా దంపతులచే పుష్కరిణి ప్రారంభం, పాండురంగస్వామి, వరహాస్వామి, హయగ్రీవ, పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహాల ప్రతిష్ఠ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్య అతిథులతో పాటు కాకినాడ పార్లమెంట్ సభ్యురాలు వంగా గీత, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, పెండెం దొరబాబు, పర్వత పూర్ణ చంద్ర ప్రసాద్, ఇతర నాయకులు, అధికారులు పాల్గొంటారన్నారు.

నేటి బాలమేధావులే రేపటి శాస్త్రవేత్తలు



జగ్గంపేట డిగ్రీ కాలేజీలో సైన్సు దినోత్సవం



తొండంగి మండలం ప్రభుత్వ డిగ్రీకళాశాలలో మాట్లాడుతున్న విశ్రాంత ప్రొఫెసర్ శాస్త్రి

- ఘనంగా సైన్స్ దినోత్సవం
- ఆకట్టుకున్న విద్యార్థుల ప్రాజెక్టులు

తుని రూరల్: నేటి బాలమేధావులే రేపటి సాంకేతిక రంగం సారథులని హంసవరం ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పుల్లా పద్మజా అన్నారు. మంగళవారం మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సాంకేతిక నమూనాల ప్రదర్శన కార్యక్రమాలు జరిగాయి. హంసవరం ఏపీ మోడల్ స్కూల్లో విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులతో కలసి సర్పంచ్ రాయి మేరీఅవినాష్ ప్రారంభించారు. కేఓ మల్లవరం, రాజుపేట, డి.పోలవరం, ఎస్.అన్నవరం, వి.కొత్తూరు, టి.తిమ్మాపురం, తేటగుంట, ఎన్.సూరవరం జెడ్పీ హైస్కూళ్లతోపాటు జగన్నాథగిరి, వి.కొత్తూరుల్లోగల ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల పాఠశాలల్లో జాతీయ సైన్సు డే నిర్వహించారు.

ఏలేశ్వరం: జాతీయ సైన్సు దినోత్సవాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. భాష్యం స్కూల్లో ప్రిన్సిపాల్ గొల్లపల్లి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు ప్రాజెక్టులు ఏర్పాటు చేశారు.
ప్రత్తిపాడు రూరల్: ప్రత్తిపాడు అఖిల్ టాలెంటెడ్ స్కూల్‌లో సైన్స్ డే నిర్వహించారు. సంస్థల అధినేత ఇనకోటి గంగాధర్ సైన్స్ ప్రయోగాలను పరిశీలించి, వాటి గురించి అడిగితెలుసుకున్నారు.

సైన్సే ఆధునిక జీవితానికి పునాది

కోటనందూరు: సైన్సే ఆధునిక జీవితానికి పునాదని, దానిపై విద్యార్థులంతా దృష్టి సారించాలని హెచ్ఎం బి.శ్రీనీల్‌కుమార్ అన్నారు. మంగళవారం పాతకొట్టాం హైస్కూల్లో జరిగిన జాతీయ సైన్స్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.
తొండంగి: పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీకళాశాలలో మంగళవారం సైన్స్ దినోత్సవం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.కె.మెహర్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులు సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఆంధ్రా విశ్వవిద్యాలయం భౌతిక శాస్త్ర విశ్రాంత ప్రొఫెసర్ డీ.ఎల్.శాస్త్రి, శ్రీకాకుళం జిల్లా పొందూరు ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డి.రామారావు, కళాశాల ప్రిన్సిపాల్ మెహర్, వైస్.ప్రిన్సిపాల్ జాన్‌కిరణ్ ప్రాజెక్టులను తిలకించారు.
శంఖవరం: స్థానిక జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం వై.సూర్యనారాయణ ఆధ్వర్యంలోజరిగిన సైన్స్‌డే లో సీవీ రామన్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.
జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపాల్ చంద్రనాయుడు ఆధ్వర్యంలో సైన్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్, రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను పరిశీలించారు.
కిర్లంపూడి: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సైన్స్ డే జరిగింది. గ్రామంలోని కొక్కొండ రామశేషగిరి పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, విజ్ఞాన భారత ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులు పలు సైన్సు ప్రాజెక్టులను ప్రదర్శించారు. హెచ్ఎం ఆకుల శ్రీనివాస్, కల్యాణ్ తదితరులు ఉన్నారు.
గోకవరం: రంపయర్రంపాలెం జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం గంధం ప్రమీలరాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు 50 రకాల ప్రాజెక్టులను రూపొందించి ప్రదర్శించారు

దర్జీలను ప్రభుత్వం ఆదుకోవాలి



కోటనందూరులో సీనియర్ టైలరును సన్మానిస్తున్న టైలర్ల సంఘ సభ్యులు



ఏలేశ్వరంలో ర్యాలీ చేస్తున్న టైలర్లు

కోటనందూరు: ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్న దర్జీలను ప్రభుత్వం ఆదుకోవాలని మండల టైలర్ల సంఘ అధ్యక్షుడు కోటిపల్లి గోవిందు అన్నారు. మంగళవారం స్థానిక నూకాలమ్మ ఆలయ ప్రాంగణంలో అంతర్జాతీయ టైలర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. కుట్టుమెషీన్ పితామహుడు విలియమ్ ఎలియాస్ హోవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలో సీనియర్ టైలర్ నీలి ఆదినారాయణను శాలువ, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో టైలర్లు ఉల్లూరి శ్రీను, మామిడి నాగబాబు, పుల్లేటికుర్తి రాంబాబు, ఎస్‌కే మీరా, రాయి నాగేశ్వరరావు, మారే బాబ్జీ, మహ్మద్ ఆదం ఖాన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.
ఏలేశ్వరం: కుట్టుమెషీన్ల సృష్టికర్త విలియమ్స్ హో జయంతిని పురస్కరించుకుని టైలర్స్ డే పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సాయి టైలర్స్ సంఘం ఆధ్వర్యంలో విలియమ్స్‌హో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలో ప్రధాన రహదారి మీదుగా ర్యాలీ నిర్వహించారు.
శంఖవరం: స్థానిక శివదుర్గ టైలర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా టైలర్స్ దినోత్సవం నిర్వహించారు. కుట్టుమిషన్ వ్యవస్థాపకుడు విలియమ్స్ హో చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. శివదుర్గ అసోసియేషన్ ప్రెసిడెంట్ మేడిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడారు.
కిర్లంపూడి: దర్జీల దినోత్సవాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని టైలర్లు కుట్టు మెషీన్ పితామహుడు విలియం హో చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల టైలర్స్ యూనియన్ ప్రెసిడెంట్ గుత్తకాల సుబ్రహ్మణ్యం, టైలర్స్ పాల్గొన్నారు.
జగ్గంపేట: స్థానిక శ్రీ షిరిడి సాయి ప్రైమరీ టైలర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ టైలర్స్ డేను ఘనంగా నిర్వహించింది. కుట్టుమిషన్ సృష్టికర్త విలియమ్స్ హో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సొసైటీ జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాస్, జగ్గంపేట మండల అధ్యక్షులు పి.సోమేశ్వరరావు ఆధ్వర్యంలో జగ్గంపేట మెయిన్‌రోడ్డులో ప్రదర్శన నిర్వహించారు.

విధులకు దూరం.. ఠంఛన్‌గా జీతం

- బురదకోట సచివాలయానికి బయోమెట్రిక్ మినహాయింపు
- ఫలితంగా చుట్టపు చూపుగా హాజరు
- సెక్రటరీ, డిజిటల్ అసిస్టెంట్ తీరుపై గ్రామస్తులు ఆగ్రహం



బురదకోట గ్రామ సచివాలయం

ప్రత్తిపాడు రూరల్: గిరిజన గ్రామాల్లో ఇంటర్‌నెట్ సదుపాయం లేకపోవడం సచివాలయ ఉద్యోగులకు వరంగా మారింది. ప్రత్తిపాడు మండలంలో బురదకోట మారుమూల గిరిజన గ్రామం. ఈ గ్రామ పంచాయతీ పరిధిలో బురదకోట, కె.మిర్తివాడ, కొండపల్లి, బాపన్నదార, మెట్టచింత, ఉలిగోగుల తదితర గిరిజన గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల పరిధిలో ఎక్కడా ఎటువంటి సెల్ సిగ్నల్ (ఇంటర్‌నెట్ సదుపాయం) ఉండదు. దీంతో బురదకోట పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామాల ప్రజలు కోరిక మేరకు మైదాన ప్రాంతంలోని ఉత్తరకంచి గ్రామంలో గ్రామ సచివాలయ సర్వీస్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. అయితే ఈ సచివాలయ ఉద్యోగులకు బయోమెట్రిక్ అటెండెన్స్ నుంచి మినహాయింపు ఇచ్చారు. ఇదే ఇక్కడి సచివాలయ ఉద్యోగుల పాలిట వరంగా మారింది.

విధులకు రాకున్నా...

బురదకోట సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ సాయిదుర్గ పలు కారణాలు చూపుతూ గత మే నెల నుంచి ఇప్పటి వరకూ విధులకు హాజరుకాకుండానే ప్రతి నెలా ఠంచన్‌గా జీతం తీసుకుంటున్నట్టు తెలిసింది. ఇక ఆమె తరహాలోనే విధులకు హాజరయ్యే పంచాయతీ కార్యదర్శి (గ్రేడ్-4) భారతి డిజిటల్ అసిస్టెంట్‌కు పూర్తి మద్దతుగా నిలిచినట్టు సమాచారం. ఇక్కడ డిజిటల్ అసిస్టెంట్ చేయాల్సిన పనిని గ్రామ వలంటీర్‌కి కొంత సొమ్ములు ముట్టజెప్పి పూర్తి చేస్తున్నారని, ఈ తంతు గుట్టుచప్పుడు కాకుండా జరుగుతోందనే ఆరోపణలు ఉన్నాయి.

పంచాయతీ కార్యదర్శి పనితీరుపైనావిమర్శలు గత ఏడాది ఏప్రిల్‌లో బదిలీపై వచ్చిన గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శి భారతి పనితీరుపైనా స్థానికంగా పలు విమర్శలు ఉన్నాయి. భారతి రాజమహేంద్రవరంలో నివాసం ఉంటున్నారు. అంతదూరం నుంచి విధులకు హాజరుకావడం ఆమెకు కష్టంగా ఉందో ఏమో సచివాలయానికి, ఆమె విధులు నిర్వర్తించాల్సిన గ్రామాలకు చుట్టపు చూపుగా వస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈమె చేయాల్సిన పనలు దర్జాగా సిబ్బందికి అప్పగించి ఈమె అత్యధికంగా ఇంటికే పరిమితం అవుతున్నట్టు తెలిసింది. బురదకోట సచివాలయ ఉద్యోగులకు బయోమెట్రిక్ హాజరు మినహాయింపు ఇవ్వడంతో డిజిటల్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి ఆడింది ఆట, పాడింది పాటగా ఉంది. అయితే వీరిద్దరూ సక్రమంగా విధులకు హాజరుకావడం లేదంటూ పెద్దాపురం డీఎల్‌డీఓ కేఎస్‌వీ ప్రసాద్ దృష్టికి వెళ్లినట్టు తెలిసింది. ఇప్పటికైనా సంబంధిత ఉద్యోగులపై విచారణ జరిపి చర్యలు తీసుకొని స్థానిక ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఎంపీడీఓ ఎస్వీ చలంను వివరణ కోరగా దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

జగ్గంపేట: మల్లిశాల గ్రామ శివారులో సారా తయారీ కేంద్రాలపై జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్ తన సిబ్బందితో మంగళవారం దాడులు చేశారు. ఈ దాడులలో సారా తయారీకి ఉపయోగించే 100 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని, సారా తయారీకి పాల్పడుతున్న ఏలూరి ముసలయ్యను అరెస్టు చేసి, కేసునమోదు చేసి కోర్టులో హాజరపరిచినట్టు తెలిపారు.

బీసీ నేతకు అభినందనలు

శంఖవరం: వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడిగా ఎంపికైన ఈగల అప్పారావుకు బీసీ నాయకులు అభినందనలు తెలియజేశారు. సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం ప్రత్తిపాడు నియోజకవర్గ అధ్యక్షుడు గొంప శివకుమార్ జి.కొత్తపల్లిలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి, పూలమాల వేసి అభినందనలు తెలియజేశారు. బర్ల లోవరాజు, గింజాల లోవరాజు, ఈగల గంగ, ఎడ్ల సత్యనారాయణ, ఈగల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



అప్పారావుకు అభినందనలు తెలియజేస్తున్న బీసీ నేతలు